క్లుప్తంగా

మట్టి ఖర్చులకు తక్షణ సాయం అందజేత

సామర్లకోట: స్థానిక 11వ వార్డులో నివాసం ఉంటున్న కొరుకొండ రాము అనారోగ్యంతో చనిపోవడంతో మట్టి ఖర్చులకు తక్షణ సహయంగా వైఎస్సార్ బీమా నుంచి శనివారం రూ.10వేలు అందజేశారు. మిగిలిన మొత్తం మృతుని భార్య ఖాతాలో జమ అవుతాయని వార్డు కౌన్సిలర్ నమ్మి సూర్యదుర్గ తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

పిఠాపురం: చిన జగ్గంపేట నుంచి తాటిపర్తికి ట్రాక్టర్‌పై ఎండు గడ్డి తరలిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డి ట్రాక్టర్ దగ్ధమైనట్లు పోలీసులు తెలిపారు. తాటిపర్తికి చెందిన కుండ్ల గంగాధర్‌కు చెందిన నాలుగెకరాలలో వరి గడ్డి ఈ ప్రమాదంలో కాలి పోయింది. సుమారు రూ.లక్ష నష్టం సంభవించినట్లు పోలీసులు చెప్పారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వసతులు ఏర్పాటు చేశారు. అన్నదానం, విరాళాలు, టిక్కెట్ల ద్వారా శనివారం సుమారు 1,74,436 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సామర్లకోట: స్థానిక బట్ల బజార్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ ఆవరణలో వాసవి సభ్యుల సహకారంతో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో వైఆర్ఎల్ డీగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 12న వివేకానంద జయంతిని పురస్కరించుకుని బహుమతులు అందజేస్తామని కళాశాల ఎండీ వై.రవిచంద్ తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం కార్యక్రమాలను సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు ప్రారంభించారు. నృత్యాంజలి నాట్యాచారిణి కృష్ణవేణి శిష్యులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. సంకురాత్రి మంజరి సంగీత కళాశాల విద్యార్థులు కీబోర్డుపై భక్తి కీర్తనలు పలికించారు. నాట్య గురువులు కృష్ణవేణి, లోకేష్‌లను సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక టౌన్‌హాల్ కమిటీ ఆధ్వర్యంలో శీతాకాలం సందర్భంగా రూ. లక్ష విలువైన 300 దుప్పట్లను శనివారం పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, కార్యదర్శి గొల్లపల్లి రామారావు ఆధ్వర్యంలో స్థానిక ఫ్రెండ్స్ కాలనీలో గిరిజన విద్యార్థులతో పాటు పేదలకు దుప్పట్లు అందజేశారు. భామిరెడ్డి మాట్లాడుతూ 140 ఏళ్ల చరిత్ర కలిగిన లిటరరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి గొల్లపల్లి రామారావు, క్లబ్ సభ్యులు పట్నాల మూర్తి, జ్యోతుల రాము, యాళ్ల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

కాకినాడ సిటీ: కార్మిక హక్కుల రక్షణకు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభలు ఈ నెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరుగనున్న నేపథ్యంలో కార్మిక చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా మందసంలో ప్రారంభమైన ఈ యాత్ర శనివారం మధ్యాహ్నం కాకినాడ నగరానికి చేరుకుంది. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సింగరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, నాయకులు చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్‌కు స్వాగతం

- బేకరీలు, మిఠాయి దుకాణాలలో సందడి
- పూల దండలు, బొకేలు సిద్ధం


అమ్మకానికి కేకులు తయారు చేస్తున్న వ్యాపారి


సామర్లకోట మరం సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా రంగులు


సామర్లకోటలో బొకేలు తయారు చేస్తున్న పూల వ్యాపారస్తులు


2023 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో విక్రయానికి సిద్ధంగా పండ్లు

సామర్లకోట: న్యూ ఇయర్ వేడుకలకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. మిఠాయి దుకాణాలు, బొకే షాపులు, పండ్ల దుకాణాలు, ప్రముఖమైన హొటళ్లలో సందడి నెలకొంది. ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లులు ముచ్చటగొలుపుతున్నాయి. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తనకు శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే సుమారు 20 వేల మందికి అభిమానులకు భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అచ్చంపేటలోని ఆయన స్వగృహంలోను, జనసేన నాయకుడు తుమ్మల బాబు పులిమేరు గ్రామంలోను అభిమానులకు అందుబాటులో ఉంటారు. శనివారం కౌన్సిల్ సమా వేశం జరగడంతో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్ మోజెస్, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణలు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కొంగొత్తగా స్వాగతం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు 2023 ఆకారంలో కూర్చుని కొత్త సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలికారు. ఇది పలువురిని ఆకర్షించింది.

మృతుడి కుటుంబానికి సాయం


ఉప్పాడలో బండియ్య కుటుంబానికి సాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: ఇటీవల మండలంలో పలువురు మృతి చెందగా ఆయా కుటుంబాలకు శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. పొన్నాడ శివారు ఉప్పాడకు చెందిన తిక్కాడ బండియ్య మృతి చెందగా అతని కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఇచ్చారు. రామన్నపాలేనికి చెందిన గుండుబోగుల బాబూరావు ఇల్లు ప్రమాదంలో కాలిపోగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నిత్యావసర వస్తువులు, రూ.3 వేల ఆర్థిక సహాయం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, సర్పంచ్ నక్కా మణికంఠబాబు, మత్స్యకార నాయకుడు ఉమ్మిడి జాన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు చేపట్టాలి

కొత్తపల్లి: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన చేపట్టాలని ఈఓపీఆర్డీ భాస్కర్ తెలిపారు. హౌసింగ్ డే సందర్భంగా పొన్నాడ శివారు కోనపాపపేటలో ఉన్న ప్రభుత్వ లేఅవుట్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలం మంజూరైన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పేదల ప్రగతే ముఖ్యమంత్రి లక్ష్యం


జి.మేడపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

- గడప గడపకూ కార్యక్రమంలో దవులూరి దొరబాబు

సామర్లకోట: గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజలు ప్రగతి సాధించాలనే లక్ష్యంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. శనివారం జి.మేడపాడులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మన వీరబాబు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి సమస్యలు లబ్ధిదారులకు అందిన పథకాలను వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయ పరిధిలో సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వార్డు సభ్యులు ఏడాకుల రామకృష్ణ, గవర వీరభద్రరావు, కోన సత్య, పుట్టా బుజ్జిబాబు, సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే దీక్షలు

పెద్దాపురం: కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పట్టాభి గేట్ ముందు దీక్షలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభల సందర్భంగా చేపట్టిన కార్మిక చైతన్య యాత్ర శనివారం పెద్దాపురం చేరుకుంది. యాత్రకు స్థానిక మున్సిపల్ సెంటర్‌లో స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. యూనియన్ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి నరసింగరావు, అఖిల భారత ఉపాధ్యక్షులు బేబీరాణి మాట్లాడుతూ కనీస వేతనాల అమలు చేసే వరకు కార్మికుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రెండవ తేదీన భీమవరంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై అసంతృప్తి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణ

- వివిధ సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో చర్చ

సామర్లకోట: మున్సిపల్ అధికారుల తీరుపై అధికార పక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో ఎవరి పింఛన్లూ తొలగించకున్నా లబ్ధిదారులను ఎందుకు ఆందోళనకు గురిచేస్తున్నారని వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, అధికార పక్ష సభ్యులు ఆవాల లక్ష్మీనారాయణ, పాగా సురేష్‌కుమార్, సేపేని సురేష్, నేతల హరిబాబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 600 పింఛన్లు తొలగించారని టీడీపీ వారు ఆందోళన చేయడానికి అధికారుల తప్పుడు సమాచారమే కారణమని వారు పేర్కొన్నారు. పట్టణంలో వీధిలైట్లు వెలగడం లేదని, కుక్కల సమస్య పరిష్కరించడం లేదని అధికారులను నిలదీశారు. దీనిపై డీఈ మాట్లాడుతూ సిబ్బంది కొరత ఉందని చెప్పడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు కౌన్సిలర్ల సమక్షంలో ప్రతీ రోజు వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని చైర్‌పర్సన్ అరుణ అధికారులకు సూచించారు.

పనుల్లో జాప్యంపై మండిపాటు


పిఠాపురం మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, పనులను జాప్యం చేస్తున్నారని కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగింది. తొలుత అధికారులు అజెండాలో పొందుపరిచిన అంశాలను చదివి వినిపించగా ఇందులో 1 నుంచి 15 వరకు, 19 నుంచి 43 వరకు పలు అభివృద్ధి పనులు ఒక నెల పాటు వాయిదా వేయాలని ఆయన కోరారు. అనంతరం పలు అంశాలపై టీడీపీ, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటుచేసుకుంది. పట్టణంలోని వీధుల్లో రోడ్లపై రోజుల తరబడి చెత్త వదిలేస్తున్నారని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోడం లేదని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. పారిశుధ్య సమస్య పెరుగుతోందని, వీధి లైట్లు, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో చాలా అధ్వానంగా ఉన్నాయని వాటిని సరి చేయాలని సభ్యులు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, కమిషనర్ ఎం.రామ్మోహన్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కాకినాడ సిటీ: భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన వేస్తే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని కాకినాడ నగరపాలక సంస్థ ఏడీఏ నాగ నరసింహారావు హెచ్చరించారు. శనివారం 9వ డివిజన్ దుమ్ములపేట సమీపంలోని కూరగాయల మార్కెట్‌ను సందర్శించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి
- సచివాలయ కన్వీనర్లకు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి, చిత్రంలో కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న

కాకినాడ: వైఎస్సార్ సీపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సచివాలయ కన్వీనర్ల పాత్ర ఎంతో కీలకమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక డీ కన్వెన్షన్‌లో శనివారం మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన సచివాలయ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు కాకినాడ నగరంలో 84 సచివాలయాల పరిధిలో 252 మంది కన్వీనర్లను నియమించి పార్టీ అధిష్టానానికి పంపామన్నారు. వీరంతా తమ సచివాలయ పరిధిలో ఏ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి.. అందకపోతే కారణమేమిటి.. అర్హత ఉండి ఎవరైనా లబ్ధి పొందలేకపోతున్నారా.. తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలను ఎప్పటికప్పుడు ప్రతి గడపకూ చేరవేయడంలో చురుగ్గా పనిచేయాలన్నారు. సోషల్ మీడియాను మరింత పటిష్టం చేసుకుని ప్రజలతో మమేకం కావాలని కోరారు. అలాగే సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రతి వలంటీర్ పరిధిలో ఇరువురు చొప్పున గృహ సారథులను రెండు రోజుల వ్యవధిలో నియమించేలా పేర్లు సిద్ధం చేసి పంపాలని అన్నారు. కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో పనిచేసి 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రజలకు దగ్గర కావాలని సూచించారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయకుమార్, చోడిపల్లి సత్యప్రసాద్, పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ఏఎంసీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, పలువురు కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రూ.1.40 కోట్లతో ఉద్యాన వనాల నిర్మాణం

15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.4 కోట్లతో ప్రతిపాదించిన రెండు ఉద్యాన వనాల నిర్మాణానికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక శారదాదేవి ఆలయ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 80 అడుగుల రహదారి వద్ద ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రిజర్వ్ పోలీస్ లైన్, చీడిలపోర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఈ పార్కులను నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, అదనపు కమిషనర్ నాగ నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా పార్కులను తీర్చిదిద్ది రెండు నెలల్లో వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఇదే ప్రాంతంలో వివిధ సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని నిర్ణయించామన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు రాగిరెడ్డి బన్నీ, శైలజ, ఇమ్మిడిశెట్టి వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 144 సెక్షన్

కాకినాడ క్రైం: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలో శని, ఆదివారాలలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

కాకినాడ సిటీ: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. కాకినాడ సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన ఏపీత్రయం, నేమాం లేఅవుట్లను ఆయన శనివారం పరిశీలించారు. ఏపీత్రయంలో 308 మంది లబ్ధిదారులకు ఇప్పటికే 259 మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారన్నారు.

పోలీసుల అదుపులో జనసేన కార్యకర్తలు

కాకినాడ క్రైం: స్థానిక త్రీ టౌన్ పోలీసులు శనివారం కొందరు జనసేన కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. మెయిన్ రోడ్డులోని వినాయకుడి గుడి సమీపంలో పలు ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తుండగా వారు అడ్డుకున్నారు. కేవలం జనసేన ఫ్లెక్సీలే తొలగిస్తున్నారంటూ నిరసనకు దిగారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

బోట్‌క్లబ్: స్థానిక పళ్లంరాజునగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 2న సప్తద్వార ఉత్తర దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి సత్యనారాయణాచార్యులు శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని అన్నారు. దీని ద్వారా కోటి యజ్ఞాల చేసిన ఫలితం భక్తులకు లభిస్తుందన్నారు.